క్లుప్తంగా

లింగ సమానత్వంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కోమలి

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే లింగ సమానత్వంపై తగిన అవగాహన కలిగి ఉండాలని ఆంధ్ర యూనివర్సిటీ హ్యూమన్ రైట్స్ సభ్యురాలు జి.కోమలి అన్నారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం లింగ సమానత్వంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులు, మహిళలతో సమానంగా ట్రాన్స్‌జెండర్స్ కూడా వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. లింగం అనేది మెదడుకు సంబంధించిందని..సెక్స్ అనేది బయోలాజికల్ అంశం అని వివరించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ. ఫ్లోరా పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని బేడా వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలను అందజేశారు.

900 కిలోల పీడీఎస్ రైస్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ రైస్‌తో సివిల్ సప్లైస్ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఆటోనగర్‌లో అప్పల నాయుడు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 900 కిలోల పీడీఎస్ రైస్‌ను సోమవారం ఆటోలో తరలిస్తుండగా గాజువాక పోలీసులు గుర్తించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సివిల్ సప్లై ఆర్ఐ రవికుమార్ వీఆర్వోలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను గాజువాక పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జీతాలు చెల్లించండి సారూ..



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ కూడలి వద్ద తాలీ బజావో నిర్వహిస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలంటూ స్టీల్‌ప్లాంట్ యువకార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్లకార్డులతో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్నారు. అందులో భాగంగా కార్మికులు సోమవారం తాలీ బజావో (ప్లేట్ల చప్పుడు) తో తమ ఆవేదన తెలియజేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్లేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ తమ ఘోష వినాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మాల కనకరెడ్డి, ప్రతిమ, అట్టా అప్పారావు, జెర్రిపోతుల రమణ, వియ్యపు కిరణ్, దుల్ల గోపీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- నేరాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- డీసీపీ–2 తుహిన్ సిన్హా సూచన
- పినగాడి, సరిపల్లి చెక్ పోస్టుల తనిఖీ



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ–2 తుహిన్ సిన్హా



సరిపల్లి వద్ద గంజాయి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ–2 తుహిన్ సిన్హా

పెందుర్తి: గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నామని డీసీపీ–2 తుహిన్ సిన్హా అన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి..పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని..పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్‌గా ఉండాలన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా గస్తీ నిర్వహించాలని క్రైం విభాగం అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పినగాడి, సరిపల్లి వద్ద ఉన్న గంజాయి చెక్‌పోస్టులను తుహిన్ సిన్హా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ పనితీరును పర్యవేక్షించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ అసిరి తాత, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ఏవో చంద్రావతి



సీహెచ్ చంద్రావతి, వ్యవసాయాధికారి

పరవాడ: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి పిలుపునిచ్చారు. గుర్తింపు కార్డుల కోసం స్థానిక వ్యవసాయ సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు భూమి యజమాని అంగీకార పత్రం, భూ యజమాని ఆధార్ కార్డు జెరాక్స్, భూ యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, 1బీ జెరాక్స్, కౌలు రైతు ఆధార్ జెరాక్స్, భూ యజమాని, కౌలు రైతు ఫోన్ నంబర్లను వ్యవసాయ సహాయకులకు సమర్పించాలన్నారు. అప్పుడు 11 నెలల కాలానికి కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడం ద్వారా బ్యాంకులో రుణ సదుపాయం పొందవచ్చునని చెప్పారు. రాయితీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు కౌలు రైతుల పేరుతోనే కొనుగోలు చేసుకొనే సౌలభ్యం లభిస్తుందన్నారు. పంట నమోదు, పంటల బీమా, పంట నష్టపరిహారం కౌలు రైతు పేరుతోనే వస్తుందని చెప్పారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో అమ్మకం కౌలు రైతు పేరుతోనే చేయవచ్చునని చెప్పారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం



సంతోషిమాతకు పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి: సాధుమఠం వద్ద ఉన్న రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సంతోషిమాత ఆలయంలో శ్రావణ మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ బోధనపల్లి మురళీకృష్ణశర్మ, బోధనపల్లి రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. కుంకుమార్చన గావించారు.

వెంకన్న ఆలయంలో..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రావణ మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం లక్ష్మీదేవికి కుంకుమపూజలు నిర్వహించారు. వచ్చే నెల 3వతేదీ వరకు ప్రతీరోజు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకూ పూజలు నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే శ్రావణ శుక్రవారాల రోజున ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే సహస్రనామ పూజల్లో భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కొండవాలులో రక్షణ చర్యలు చేపట్టాలి
- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, కొండవాలు మెట్ల మార్గాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్యా కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాలువలో పూడికలు, ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లోని మెట్ల మార్గాల్లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నివాసాల్లోకి వర్షపు నీరు చేరుతున్నందున.. శాశ్వత పరిష్కారం కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో డయేరియా, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్‌కు సూచించారు. వయసు పైబడిన పారిశుధ్య కార్మికులను కొండవాలు ప్రాంతాల నుంచి వేరొక చోటుకు మార్పి వేసి సమర్థులైన కార్మికులను ఏర్పాటు చేయాలని జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ఈఈలు, మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి(ఆర్‌వో) బాబూరావు, ఏసీపీ వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఏయూ షటిలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు సాగాయి. ఈ పోటీల్లో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు పలువురు ఇతర ఉద్యోగులకు చెందిన 15 జట్లు పాల్గొనగా.. క్రీడాకారులు డబుల్స్ కేటగిరీలో తలపడ్డారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు సోమవారం వరకు కొనసాగాయి. తుది పోటీల్లో గవిరెడ్డి రామానాయుడు, అభిరామ్‌ల జట్టు విజేతగా నిలిచింది. సూర్యకుమార్, హితేష్‌ల జట్టు ద్వితీయ స్థానం, డొక్కర ప్రసాద్, సబ్బవరపు వెంకటేష్ జట్టు తృతీయ స్థానం, ఎం.లావణ్య యాదవ్, కృష్ణల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కోచ్‌లతో పాటు ఏయూ ఇండోర్ నిర్వాహకుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికి అవకాశం కల్పించారు. 13ఏ బెటాలియన్, ఎన్‌సీసీ అధికారులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 36 క్యాడెట్ల ఖాళీలను భర్తీ చేయనున్నామని కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు తెలిపారు. వీరిలో 24 మంది పురుషులు, 12 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 13ఏ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ సుజాన్ సింగ్, పీఐ స్టాఫ్ ఆనంద్‌సింగ్, బసంత్‌సింగ్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఆటోల వేలం రేపు

సబ్బవరం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో పాత ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ రెండు ఆటోలను ఈ నెల 7న వేలం వేయనున్నట్లు స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సబ్బవరం సెబ్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన అప్పారావు

పరవాడ: అనకాపల్లి–గాజువాక రహదారిలో లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలు.. అనకాపల్లి మండలం మారేడుపూడికి చెందిన అప్పారావు (48) ద్విచక్ర వాహనంపై శ్రీరామనగర్ కాలనీకి వెళుతున్నారు. ఈ క్రమంలో లంకెలపాలెం ప్రభుత్వ వైన్‌షాపు దాటిన తర్వాత ఎడమ వైపు తిరుగుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన ఫార్మాసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు డ్రైవర్ అప్పారావు నడుపుతున్న బైక్ హ్యాండిల్‌ను రాసుకుని వెళ్లిపోయాడు. దీంతో అప్పారావు రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలు తగిలాయి. ఇంతలో అదే మార్గంలో వస్తున్న మరో ద్విచక్ర వాహనం రోడ్డు మీద పడి ఉన్న అప్పారావుపై నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై మృతుడి కుమారుడు కనకరాజు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలని..

లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ



నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న లంకెలపాలెం విద్యార్థులు

అగనంపూడి: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో భారతదేశం క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పరవాడ మండలంలోని లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బాక్సింగ్ కోచ్ షేక్ రెహ్మాన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రమణ, శ్రీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఏకపక్ష వైఖరి విడనాడాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష వైఖరి అవలంబిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కుట్రలు చేస్తున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1271వ రోజు, సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం విలువైన భూమిని ధారాదత్తం చేసిన వారిని నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, జి.జయ, ఎ.శివరామకృష్ణ, సీతారామరాజు, చీకటి శ్రీనివాస్, డి.దేముడు జి.ఆనంద్ కాంగ్రేగుల శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న ముమ్మన దేముడు, గండి రవి

పెందుర్తి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను సోమవారం 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నగరంలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి బొత్సను సత్కరించారు. ఈ సందర్భంగా దేముడు, రవి మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలో బొత్స సత్యనారాయణను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు కర్రి బాబు, దెడ్డం ప్రసాద్, సియాద్రి బాలచంద్ర, యర్రంశెట్టి రాము, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, గురి శ్రీనివాస్, కరక రాము, గొలగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సేద్యం మేలు



యంత్రంతో వరినాట్లు వేస్తున్న తీరును పరిశీలిస్తున్న అధికారులు

పెందుర్తి: అందుబాటులో ఉన్న ఆధునిక వనరులను వినియోగించుకుని వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి అన్నారు. నరవలో యంత్రం ద్వారా వరినాట్లు వేసే విధానాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ఊపందుకున్న తరుణంలో రైతు కూలీల కొరత ఉన్నందున యంత్రాలతో సాగు అన్నదాతలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎకరా విస్తీర్ణం వరినాట్లు వేయడానికి ఈ యంత్రం ద్వారా రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. రోజుకు 6–8 ఎకరాల్లో వరినాట్లు వేసుకోవచ్చని చెప్పారు. రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఏడీఏ డీఆర్‌సీ సుబ్రహ్మణ్యం, ఏడీఏ హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, ఏఈవో ఎన్.రమణ, ఎంపీఈవో టి.లోకేశ్వరి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత

పెందుర్తి: విద్యార్థి దశలో ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత అన్నారు. స్థానిక ఎస్సీ బీసీ వసతి గృహంలోని విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికాలంలో యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితిలోనూ చెడు మార్గాల వైపు వెళ్లవద్దని..వెళితే జైలుపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దాడి రమణచిట్టి, దాడి ఉమామహేష్

పెందుర్తి: డీఆర్‌సీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తిలో సోమవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి రమణచిట్టి, 96వ వార్డు పార్టీ అధ్యక్షుడు దాడి ఉమామహేష్ చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. అనిల్ నీరుకొండ ఆసుపత్రి, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుప్రతి వైద్య బృందం 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. వైద్య నిపుణులు సాహిల్ వాలియా, చంద్రశేఖర్, ప్రియాంక, శ్రద్ధా రాజు, జ్యోత్స్న వివేక్ గోపికృష్ణ, శ్రీరామ్, శ్రీలేఖ, వి.సుభద్ర, సునానందదేవి, పీఆర్వో ఉదయ్, కో ఆర్డినేటర్ ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలి



పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు కోరారు. ఈ సమస్యపై ఈ నెల 6 నుంచి 8 వరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద అసోసియేషన్ ప్రతినిధి కణితి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాకు మద్దతుగా విశాఖ నగరంలోని జీవీఎంసీ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 8న ధర్నా చేయనున్నామని తెలిపారు. మినిమం పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, డీఏకు అనుగుణంగా మెడికల్ సౌకర్యాలు కల్పించాలని, పెన్షనర్లకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. రైలు చార్జీల్లో 50శాతం మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ పెంటారావు, శెట్టి అప్పారావు, బైరెడ్డి గురప్ప, దుర్గారావు, శెట్టి చిన్నా సన్యాసిరావు, నక్క అప్పారావు తదితరులు పాల్గొన్నారు.